సమాచారం.. ఏదీ చైతన్యం?

సమాచార హక్కు చట్టం. సామాన్యుని చేతిలో బ్రహ్మాస్త్రం. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన కార్యక్రమాలు, అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసిన వివరాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు సామాన్యులకు ప్రభుత్వం అందించిన అస్త్రం ఈ చట్టం. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి ఖర్చులు, నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన వివరాలు సామాన్యుడు సైతం తెలుసుకునేందుకు ఈ చట్టాన్ని తెచ్చింది. అయితే స.హ. చట్టంపై ప్రజలకు చైతన్యం కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ నిధులు వేటికి ఖర్చు చేశారనే వివరాలను తెలుసుకునేందుకు వీలుగా 2005 మే 11న సమాచార హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చింది.



- 19 ఏళ్లయినా సగం మందికి అపరిచితమే
- అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఇప్పటివరకు అందిన దరఖాస్తులు 200లోపే

బంగారుపాళెం: మండలంలో ఈ సమాచార హక్కు చట్టంపై సగం మందికి కూడా సరైన అవగాహన లేదు. చాలా మందికి అసలు ఈ చట్టం గురించే తెలియదు. దీనిపై అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 19 ఏళ్లయినా ప్రజల్లోకి వెళ్లలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులకే పరిమితమైంది. ఇన్నేళ్లలో మండలంలో దీన్ని వినియోగించుకున్న వారు 200 మంది కూడా లేరు. వివిధ శాఖలకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరిన వారు పదుల సంఖ్యలో ఉన్నారు. కార్యాలయాల పరిధిలో ఏర్పాటుచేసిన బోర్డుల్లో పౌరసమాచార అధికారి, సహాయ పౌరసమాచార అధికారి పేర్లు సైతం నమోదు చేయడంలేదు. ఈ పేర్లు రాయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సంక్షేమ పథకాల పని తీరు గురించి తెలుసుకోవాలనే వారికి ఏ అధికారిని సంప్రదించాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫారాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం.



అధికారుల వివరాలు లేని సమాచార హక్కు చట్టం బోర్డు



జంబువారిపల్లె సచివాలయం బోర్డులో ఉన్న పాత అధికారుల పేర్లు

అధికారులకే కదా పని ఎక్కువ

ఈ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తే, అధికారులకే పని ఎక్కువవుతుందని భావించి వారు పట్టించుకోవడం లేదన్న చర్చ వినిపిస్తోంది. మండలంలో ఎక్కువ మంది పథకాల వివరాల కోసం దరఖాస్తు చేసుకుంటే, నిర్ణీత కాలంలో అధికారులు పూర్తి వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల తమకే ఎక్కువ ఇబ్బందులు వస్తాయని వారు దీనిపై ప్రజల్లో అంతగా చైతన్యం తీసుకురావడం లేదన్న భావన వ్యక్తమవుతోంది. పైగా అధికారులు చేసిన తప్పొప్పులు కూడా ఇందులో బయటపడతాయి. దరఖాస్తు దారులకు జవాబుదారీగా వ్యవహరించాల్సి ఉంటుందన్న భయంతో ఈ చట్టాన్ని ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అరకొర సమాచారంతోనే సరి

అడిగిన పూర్తి వివరాలు ఇవ్వకుండా ఏదో మొక్కుబడిగా అరకొర సమాచారం ఇచ్చినట్లు పలువురు దరఖాస్తుదారులు చెబుతున్నారు. మరికొన్ని దరఖాస్తులకు అసలు స్పందించకుండానే దరఖాస్తుదారులను పిలిచి సర్దుబాటు చేసి పంపించేసినట్లు సమాచారం. ఇలా సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు కావడం లేదు. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేదు. ఫలితంగా ప్రజలకు ఈ చట్టం వల్ల ఉపయోగం లేకుండా పోతోంది.

స.హ చట్టంపై అవగాహన కల్పించాలి



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ప్రజలకు ఈ చట్టంపై అవగాహన ఉంటే ప్రభుత్వ పథకాల్లో అవకతవకలు జరగడానికి అవకాశం ఉండదు. కార్యాలయాల్లో చట్టానికి సంబంధించి సమాచారం అందించే అధికారుల పేర్లను బోర్డుల్లో నమోదు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– చెంగల్రాయులు, మాజీ ఎంపీటీసీ, తగ్గువారిపల్లె

ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం



గ్రామాల్లో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం కోరితే వారికి నిబంధనల ప్రకారం సకాలంలో కోరిన వివరాలను అందించేందుకు కృషి చేస్తాం. ఈ సమాచార హక్కు చట్టాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీధర్, ఇన్చార్జి ఎంపీడీఓ, బంగారుపాళెం

క్లుప్తంగా

విద్యుత్ అదాలత్‌లో ఆరు ఫిర్యాదులు



విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో ఆరు ఫిర్యాదులు వచ్చాయని ఏడీ సురేష్ తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను చైర్మన్ రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. పైపల్లె సబ్ డివిజన్ పరిధిలోని తవణంపల్లె, బంగారుపాళెం, యాదమరి ఐరాల మండలాలకు సంబంధించి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు, సొంతభూమిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయరాదని, ఇళ్ల పక్కన గల 11 కేవీ విద్యుత్ లైన్ మార్పు చేయాలని ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, డీఈ సురేష్, ఏఈ హేమచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తులసి కుటుంబానికి సాయం అందించాలి

చిత్తూరు కలెక్టరేట్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హాకీ కోచ్ తులసిబాబు కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని జనసేన నాయకులు మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా అండర్ 19 హాకీ కోచ్ తులసీబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఆయన మరణం క్రీడాలోకానికి తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. కోచ్ కుటుంబానికి ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. అతి చిన్న వయస్సులో కష్టపడి ఉన్నత చదువులు చదివి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం తులసి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

నైపుణ్య గణన పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న శిక్షకుడు పునీత్

ఐరాల: మండల వ్యాప్తంగా చేపట్టనున్న నైపుణ్య గణన సర్వే–2024ను పక్కాగా చేపట్టాలని ఈఓపీఆర్డీ కుసుమకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల స్థాయి సిబ్బందికి నైపుణ్య గణన సర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నైపుణ్య గణన సర్వేలో భాగంగా 18 నుంచి 59 ఏళ్ల వయసు వారి వివరాలను సేకరించాలన్నారు. వారి విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, వారి ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆసక్తి, ప్రస్తుత ఉపాధి వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు పునీత్, మండల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ప్రమాదకరం

బంగారుపాళెం: పొగాకు ఉత్పత్తులను ద్వారా ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధులు వస్తాయని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ అన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలోని వెల్‌నెస్ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పొగాకు, హన్స్, గుట్కాలు నమలడం, ధూమపాన సేవనం ద్వారా క్యాన్సర్ వస్తుందన్నారు. స్త్రీలకు నోరు, రొమ్ము, గర్భాశయాల క్యాన్సర్ వస్తుందన్నారు. పురుషులకు ఊపిరితిత్తులు, నోటి, గొంతు, బ్లడ్ కేన్సర్లు వస్తాయన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. కేన్సర్ వ్యాధులపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం మూలాన ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. జబ్బుని ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స పొందితే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ప్రభుత్వం కేన్సర్ బాధితులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యసేవలు అందిస్తాయని పేర్కొన్నారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

అనారోగ్యంతో పాలేరు వీఆర్‌ఏ మృతి



వరదయ్య(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని పాలేరు వీఆర్‌ఏ వరదయ్య అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. వరదయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మొగిలివెంకటగిరిలో వరదయ్య భౌతికకాయాన్ని గురువారం స్థానిక రెవెన్యూ అధికారులు, వీఆర్‌ఏలు స్థానిక ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చు లేకుండా, సమయం వృథా కాకుండా ఇంటివద్దే వైద్యసేవలు అందుతున్నాయని పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య అన్నారు. మండలంలోని వసంతాపురం గ్రామంలో గురువారం ఆమె ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటుచేసి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలందించారు. 50 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఉమామహేశ్వరి, సుజిమ, స్వప్న, చంద్ర పాల్గొన్నారు.

వైస్ చైర్‌పర్సన్ వివాహ రిసెప్షన్‌లో ప్రముఖులు





వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నారాయణస్వామి, రెడ్డెప్ప, శ్రీనివాసులు, విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని ఓ కల్యాణ మండపంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య వివాహ రిసెప్షన్ గురువారం జరిగింది. దీనికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఈసీఈ విద్యార్థులకు జాతీయ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వెంకటాచలపతి

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఈసీఈ మూడవ సంవత్సరం విద్యార్థులు జాతీయ స్థాయి బహుమతి సాధించారని ప్రిన్సిపల్ వెంకటాచలపతి తెలిపారు. ఈ మేరకు ఆ కళాశాలలో గురువారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ గత నెల 6వ తేదీన నేషనల్ అట్మాస్ఫియర్ రీసెర్చ్ లాబొరేటరీ నిర్వహించిన పోటీల్లో మూడవ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు 3వ బహుమతి సాధించారన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఈ బహుమతి సాధించడం గొప్ప విషయమని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న టాప్ టైర్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఒకచోట చేర్చి ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల వల్ల వాతావరణ శాస్త్రాల రంగంలో వినూత్న పరిష్కారాలు, పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం బహుమతి సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌లు సాంబశివరావు, శరవణం తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



బహుమతి పొందుతున్న ప్రణవ్‌సాయి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బ్యాడ్మింటన్ పోటీల్లో బృందావన్ పాఠశాల విద్యార్థి ప్రణవ్‌సాయి ప్రతిభ చాటారు. ఇటీవల వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో అండర్ 19 రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిత్తూరు నగరంలోని బృందావన్ సీనియర్ సెకెండరీ స్కూల్ విద్యార్థి ప్రణవ్ ప్రతిభ చూపి వెండి పతకం సాధించారు. ఆ విద్యార్థిని బృందావన్ పాఠశాల చైర్మన్ శైలజ కుమారి అభినందించారు. క్రీడల్లో మరింత ప్రతిభ చూపించి నేషనల్ స్థాయిలో గెలుపొందాలని ఆకాంక్షించారు.

మనిషి మనిషికో చట్టం.. ఇదేం న్యాయం?

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పోలీసుల తీరు సర్వత్రా విమర్శలకు దారిస్తోంది. నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్ర వాహనాలను సీజ్ చేయాలని ఇటీవల ఎస్పీ మణికంఠ ఆదేశించారు. దీన్ని అదనుగా తీసుకుని, తమకు కావలసిన వాళ్ల బైక్‌లు మాత్రం వదిలేస్తున్నారు. మిగతా వాళ్ల వాహనాలను మాత్రం సీజ్ చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నించినా పట్టించుకునే దిక్కులేదు. వివరాల్లోకి వెళితే, గురువారం ఉదయం తనిఖీలు మొదలెట్టిన పోలీసులు, నంబర్ ప్లేటు లేని వాహనాలను ఆపారు. వాటిని స్టేషన్‌లో ఉంచి, సరైన రికార్డులు తీసుకొచ్చిన తరువాత వాహనాన్ని విడిచి పెడుతున్నారు. ఇదే సమయంలో పోలీసుశాఖలో పనిచేసే వాళ్లు నంబరు ప్లేట్ లేని వాహనాలపై తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇక టీడీపీ కార్యకర్తల వాహనాలు పట్టుకుంటే, ఆ పార్టీ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తే వదిలేస్తున్నారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజులుగా ఇదే పంచాయతీ కొనసాగుతోంది. పోలీసుల ద్వంద్వ వైఖరిపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. మనిషి మనిషికీ చట్టం మారిపోతోంది ఏం చేస్తాం... ఇది ఖాకీల రాజ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎస్పీ స్పందించి నగర పోలీసులు ప్రజలందరినీ సమానంగా చూసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నంబర్ ప్లేటు లేని వాహనాన్ని వదిలేస్తున్న వన్‌టౌన్ పోలీసులు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

బంగారుపాళెం: పట్టణంలో వాహనదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు గురువారం జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ, జాతీయ రహదారిలో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఎక్కడపడితే అక్కడ తమ ఇష్టానుసారంగా వాహనాలను పార్కుచేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సూచించారు. పాదచారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా వాహనాలను పార్క్ చేసుకోవాలన్నారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద అరగొండ రహదారిలో రోడ్డుకు ఇరుపక్కలా వాహనాలు నిలిపివేయడం వల్ల బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. దుకాణాల ముందు వాహనాలు పార్కు చేయకుండా నిర్వాహకులు జాగ్రత్త వహించాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించేవారిపై చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు.



బంగారుపాళెంలో ఆటో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది

అవగాహనతో క్యాన్సర్ దూరం

- అన్ని మండలాల్లో క్యాన్సర్ నివారణ దినోత్సవం
- గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించిన వైద్యాధికారులు, సిబ్బంది

ఐరాల: క్యాన్సర్ కారకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండటం వల్ల దాని బారిన పడకుండా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే ప్రాణపాయ ముప్పు నుంచి తప్పించుకోవచ్చన్నారు. 15 ఏళ్ల పిల్లలకు క్యాన్సర్ నివారణకు వైద్య, ఆరోగ్య శాఖ టీకాలను వేయిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యాక్సిన్ వేయించి క్యాన్సర్‌కు గురి కాకుండా కాపాడుకోవాలన్నారు. బీడీ, సిగరెట్టు, హన్స్, పాన్‌పరాగ్, గుట్కా, ఖైనీ తదితరాల వినియోగం వల్ల నోటి క్యాన్సర్ వస్తుందన్నారు. ప్రతి రోజూ శారీరక శ్రమ, వ్యాయామం, యోగా వంటివి చేయాలని పేర్కొన్నారు. పాలకల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్ వైజర్ చిన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ అజారుద్దీన్, ఎల్‌డీసీ ఉమాపతి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పూతలపట్టు: ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ నివారణ

తవణంపల్లె: స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ నివారణ సాధ్యమని వైద్యాధికారి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్.మోహన్‌వేల్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్.ప్రియాంక మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. 18 ఏళ్లు పైబడినవారు తప్పకుండా స్క్రీనింగ్ పరీక్ష చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

గుడిపాల: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారులు సంధ్య, చంద్రమహేష్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్ రావడానికి కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి వివరించారు. దేశంలో ఏడు రకాల క్యాన్సర్లతో ప్రజలు ఎక్కువగా బాధ పడుతున్నారని, వాటిలో ఊపిరితిత్తులు, రొమ్ము, నోరు, కడుపు, అన్నవాహిక, కాలేయ క్యాన్సర్లు ఉన్నాయన్నారు. కొన్ని జాగ్రత్తలతో ఈ క్యాన్సర్‌లకు దూరంగా ఉండవచ్చన్నారు. ఒక్కసారి క్యాన్సర్ వస్తే నిరంతరం అనారోగ్యంతో పోరాడాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఇంటివద్ద ఉచితంగా క్యాన్సర్ పరీక్ష చేయిస్తామని తెలిపారు. మగవాళ్లు మద్యపానం, ధూమపానం, గుట్కా, తంబా తదితర మత్తు పదార్థాలకు అలవాటు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అనూష, వెంకటేష్, చంద్రశేఖర్, సరస్వతి, ఉమా పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్యాన్సర్ అవగాహన రోజు సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. పురవీధుల్లోని ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆశావర్కర్లు లంగ్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, లివర్, బ్రెస్ట్, ఇంటెస్టిన్, యుటిరస్ క్యాన్సర్ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణా, సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



తవణంపల్లె: ర్యాలీ చేస్తున్న వైద్య అధికారులు



ఐరాల: అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది



గుడిపాల: క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి (పూతలపట్టు): విద్యార్థులు బాల్యదశలో కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మండలంలోని కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలోని బుధవారం ఐటీసీఎల్ ప్రోత్సాహంతో నిర్మించిన భోజనశాల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన భోజనశాల, మరుగుదొడ్లు, వంటగదులను ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఐటీసీఎల్‌వారు కార్పొరేషన్ సమాజ బాధ్యత కింద రూ.50 లక్షలు వెచ్చించి, మౌలిక సదుపాయాలు కల్పించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత ఆశయాలకు ముందడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీఎల్ అధికారులు కైలాష్, పట్నాయక్, అమిత్ సర్దార్, డీవైఈఓ చంద్రశేఖర్, ఎస్ఎస్ఏ ప్లానింగ్ కో–ఆర్డినేటర్ జయప్రకాష్, తహసీల్దార్ పార్థసారథి, ఎస్ఐ ఈశ్వరయ్య, ఎంఈఓ రుక్మిణి, ప్రిన్సిపల్ లలిత తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభించిన కలెక్టర్